సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



ఏపుగా పూల మొక్కలు..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హరిత హారం కార్యక్రమంలో ఈసారి పూల మొక్కల పెంపకంపై దృష్టి పెట్టారు. 8లో



విద్యార్థుల మధ్య ఘర్షణ

ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగి పరస్పరం దాడులకు పాల్పడిన ఘటన సోమ వారం రాత్రి చోటుచేసుకుంది. 10లో

గరిష్టం / కనిష్టం
37° / 19°

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు భారీగానే నమోదవుతాయి. రాత్రి వేళ వాతావరణం కొంత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



విజేతలకు పతకాలు అందజేస్తున్న సినీ నటుడు సుమన్

భద్రాచలంటౌన్: ఈనెల 26న వరంగల్‌లో జరిగిన జాతీయ స్థాయి ఆఫ్ లైన్ అండ్ ఆన్‌లైన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో భద్రాద్రి క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలను కైవసం చేసుకున్నారు. సినీ నటుడు సుమన్, చోటా ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 13 రాష్ట్రాల నుంచి సుమారు రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో జూనియర్, సీనియర్ విభాగాల్లో భద్రాచలం పట్టణం నుంచి 24 మంది పాల్గొనగా సూర్యతేజ, శ్రీహరి, రాంబాబు స్వర్ణ పతకాలు, మరో 15 మంది రజత పతకాలు సాధించారు. నలుగురు విద్యార్థులు కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

మాతృ మరణాల నివారణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ శిరీష

చుంచుపల్లి: మాతృ మరణాల నివారణకు సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష సిబ్బందికి సూచించారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సోమవారం ఎర్రగుంట, చంద్రుగొండ, సుజాతనగర్, సులానగర్, మణుగూరు, ఎంపీ బంజర పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్లు సరళ, సుకృత, బాలాజీ, చైతన్య, మణికంఠారెడ్డి, శివకుమార్, స్పందన పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలతో లాభాలు



మాట్లాడుతున్న ఖమ్మం జిల్లా ఉద్యానవన అధికారి అనసూయ


రఘునాథపాలెం: మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకంతో పాటు ఉద్యానవన పంటల సాగుపై రైతులు దృష్టి సారిస్తే లాభాలు వస్తాయని ఖమ్మం జిల్లా ఉద్యానవన శాఖాధికారి అనసూయ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెంలోని రైతు వేదికలో మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకంపై రైతులకు ఏర్పాటుచేసిన మూడు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అనసూయ, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టు పురుగుల పెంపకానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని అధిక ఆదాయం పొందాలని తెలిపారు. ప్రాంతీయ సిల్క్ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ యాదవ్, జెడ్పీటీసీ మాలోతు ప్రియాంక, ఆత్మ కమిటీ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ మాట్లాడగా, ప్రజాప్రతినిధులు, అధికారులు భూక్యా గౌరి, అఫ్జల్, శ్రీని వాసరావు, భాస్కర్‌రావు, నల్లమోతు శ్రీనివాసరావు, కుర్రా భాస్కర్‌రావు, సందీప్ కుమార్ పాల్గొన్నారు. కాగా, డైవాన్ జామసాగు చేస్తున్న రైతు తేజావత్ రాములును ఈసందర్భంగా సన్మానించారు.

డిప్యుటేషనా.. బదిలీలా..?

రామాలయ సిబ్బంది వివరాల సేకరణ

- ఏం జరుగుతుందోనని సర్వత్రా చర్చ
- ఉత్సవాల నిర్వహణలోనూ మార్పులు
- కల్యాణ వేడుకను వీక్షించే భక్తుల సంఖ్య కుదింపు
- పుష్కర పట్టాభిషేకంలో దాతలకు భాగస్వామ్యం





రామాలయం చెంతన మిథిలా స్టేడియం వ్యూ (ఇన్‌సెట్) అధికారులు విడుదల చేసిన సెక్టార్ ప్లాన్

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను దేవాదాయ శాఖ కమిషనర్ సేకరించడంతో ఆలయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. దేవస్థానంలో ఏళ్ల తరబడి బదిలీలు లేకపోవడంతో జూనియర్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, ఏఈఓ కేటగిరీల్లో ఉద్యోగులు ఇక్కడే పని చేస్తున్నారు. 10 – 15 సంవత్సరాల నుంచి బదిలీ కాని ఉద్యోగులు సైతం ఉన్నారు. ఇటీవల ఈఓ బి.శివాజీని బదిలీ చేసి తన మాతృ సంస్థ రెవెన్యూ శాఖకు పంపించారు. ఆయన స్థానంలో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రమాదేవిని నియమించారు. ఇది పూర్తయిన కొద్ది రోజులకే మళ్లీ ఉద్యోగుల వివరాలను కమిషనర్ కార్యాలయ వర్గాలు సేకరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రామాలయంలో ఇటీవల లడ్డూలు బూజు పట్టిన వివాదంతోనే ఈ చర్యలు చేపడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే బదిలీ చేస్తారా.. లేదంటే ఇటీవల కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు ప్రకటించిన నేపథ్యంలో వివిధ దేవస్థానాల్లో అధికంగా ఉన్న సిబ్బందిని డిప్యుటేషన్‌పై అక్కడికి పంపిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. వచ్చే నెలలోనే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు స్థానభ్రంశం కల్పిస్తే ఆ ప్రభావం ఉత్సవాల నిర్వహణ పనులపై పడుతుందనే మరో వాదన సైతం ఉన్నత స్థాయి అధికార వర్గాల్లో వినిపిస్తోంది.

ఈ నిర్ణయం ఎందుకో..?

ఈ ఏడాది శ్రీరామ నవమి వేడుకల్లో మిథిలా స్టేడియంలో జరిగే స్వామి వారి కల్యాణ, పట్టాభిషేక మహోత్సవాలను వీక్షించే భక్తుల సంఖ్యను ఆలయ అధికారులు కుదించారు. సుమారు 20 వేల నుంచి 17 వేల మందికి తగ్గించారు. భక్తులకు, వీఐపీలకు మండపంలో ఏర్పాటు చేస్తున్న ఏసీలు, కూలర్లతో స్థలం సరిపోవడవం లేదనే కారణంతో పాటు, ప్రతి ఏడాది టికెట్లు మిగిలిపోతున్న నేపథ్యంలో తగ్గించినట్లు చెబుతున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు సెక్టార్ ప్లాన్ విడుదల చేశారు. సీఎం సెక్టార్‌ను యథావిధిగా ఉంచగా, ఉభయదాతలు ఉండే 1బీలో రూ.2,500 టికెట్లను, 1ఏలో రూ.7,500 ఉభయదాతల సెక్టార్లను అటు ఇటుగా మార్చారు. ఇక ఉత్సవాల టికెట్ల విక్రయానికి సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. ఈ టికెట్లతో పాటు వసతి, లాడ్జీల వివరాలను ముందుగానే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే టికెట్లు మిగిలే అవకాశం ఉండదని భక్తులు అంటున్నారు.

దాతలు ముందుకు రావాలంటూ..

వచ్చే నెల 30, 31 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలకు సంబంధించి చేపడుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు సదుపాయాల కల్పనలో దాతలు సహాయ సహకారాలు అందించాలని ఈఓ రమాదేవి కోరుతున్నారు. ఆలయం, కల్యాణ మండప పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాల అలంకరణకు రూ.18 లక్షలు, రుత్విక్‌ల సంభావనలకు రూ.10 లక్షలు, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం హోమాలు చేసే వేద పారాయణులకు భోజన వసతికి రూ.10 లక్షలు, స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణకు రూ.8 లక్షలు చెల్లించే భక్తులు ముందుకు రావాలని ఆహ్వానించారు. అలాగే యాగశాలల ఏర్పాటుకు రూ.5లక్షలు, నవమి, పట్టాభిషేకం జరిగే రెండు రోజుల్లో భక్తులకు అన్నదానానికి రూ. 5లక్షలు, చలువ పందిళ్ల ఏర్పాటుకు రూ.4 లక్షలు, స్వాగత ద్వారాల ఏర్పాటుకు రూ.4లక్షలు, 10 రోజుల పాటు హోమద్రవ్యాలకు రూ.3లక్షలు, 12 నదీ జలాల సేకరణకు రూ.1.44 లక్షల వ్యయం అవుతుందని వెల్లడించారు. వీటికి దాతలు ఆర్థికంగా సహకరించాలని కోరారు.



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్ అనుదీప్

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. పరిష్కార స్వభావాన్ని ప్రజావాణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. వచ్చే సోమవారం నాటికి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఆర్‌ఓకు సూచించారు. అవకాశం ఉన్న వాటిని తక్షణమే పరిష్కరించాలని, అవకాశం లేకుంటే అదే విషయాన్ని దరఖాస్తుదారునికి లిఖితపూర్వకంగా తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- పాతపాల్వంచ చింతల చెరువు నక్కలవాగు అలుగు కాల్వను ఆక్రమించి అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేయగా ఇరిగేషన్ అధికారులకు ఎండార్స్ చేశారు.
- లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలో కొంతమంది వ్యక్తులు ఇసుక మాఫియా, ల్యాండ్ మాఫియాను ప్రోత్సహిస్తున్నారని, ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని, అమ్మవారికుంట, చాకలికుంట, సర్వే నెంబర్ 264/1/45లోని భూమిని కూడా ఆక్రమించారని వై.జగన్మోహన్ రావు అనే వ్యక్తి దరఖాస్తు చేయగా సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.
- కొత్తగూడెం ప్యూన్‌బస్తీలోని షాదీఖానాకు మరమ్మతులు నిర్వహించాలని జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఎండి యాకుబ్‌పాషా వినతిపత్రం అందించగా మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.

వేసవిలో తాగునీటి కొరత రానివ్వొద్దు

వేసవిలో తాగునీటి కొరత రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో పలు అంశాలపై సంబంధిత అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మంచినీటి పైప్‌లైన్లను పరిశీలన చేయాలని, ఎక్కడైనా వాల్వ్ తొలగిస్తే మరమ్మతులు చేసి, కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కొత్తగూడెం, పాల్వంచలలో రెండుపడక గదుల కేటాయింపునకు గ్రామ సభలు నిర్వహించాలని చెప్పారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. జీఓ 76 ప్రకారం కొత్తగూడెంలో పెండింగ్‌లో ఉన్న 230 దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతులు పూర్తి చేయాలి..

మన ఊరు – మన బడిలో చేపట్టిన పాఠశాలల మరమ్మతు పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం కొత్తగూడెం, వైరా నియోజకవర్గ పరిధిలోని జూలూరుపాడు మండలాల విద్య, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ డీఈఓ సోమశేఖరశర్మ, పీఆర్ ఈఈ సుధాకర్, ఐడీసీ ఈఈ నాగేశ్వ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న అహ్మద్ హుస్సేన్


అశ్వారావుపేటరూరల్: స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా కలుగుతుందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్ అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో సోమవారం షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా ఐసీఏఆర్ సహకారంతో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పుష్పాలు ఎండపెట్టే పద్ధతితోపాటు వివిధ రకాల ఉత్పత్తుల తయారీ విధానం గురించి వివరించారు. ఎండు పుష్పాల ప్రాముఖ్యత, విదేశాలకు ఎగుమతి, రకరకాల ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ చేసే విధానం, లాభాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం డీన్ మాట్లాడుతూ.. విద్య ఎంత ముఖ్యమో, స్వయం ఉపాధి కూడా అంతే ముఖ్యమని అన్నారు. స్వయం ఉపాధితో నేడు ఎంతో మంది ఆర్థికంగా బలపడుతున్నారని, మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ జి.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఐవీ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పావని, డాక్టర్ కె.శిరీష, డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

సంక్షేమ పాలన మాతోనే సాధ్యం

ఖమ్మంరూరల్: దేశం, రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించడం బీజేపీకే సాధ్యమని ఆ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుర్రాలపాడులో సోమవారం రాత్రి జరిగిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల ఆకాంక్షలతో సాగిన ఉద్యమ ఫలితంగా ఏర్పడిన తెలంగాణ ప్రస్తుత ఎవరికీ న్యాయం జరగడం లేదన్నారు. ఈ నేపథ్యాన ప్రజలు బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నూకల రాంమోహన్‌రెడ్డి, రుద్ర ప్రదీప్, బి.నాగరాజు, మేక సంతోష్‌రెడ్డి, ఉపేందర్‌గౌడ్, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నుంచి 5వేల క్యూసెక్కులు

రేపటి నుంచి ఆయకట్టుకు నీరు



నీటి విడుదల నిలిపేయడంతో అడుగంటిన సాగర్ ప్రధాన కాల్వ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు బుధవారం నుంచి నీటి విడుదల పునరుద్ధరణపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో జలవనరుల శాఖ ఈఎన్‌సీ మురళీధరావు సమక్షాన సోమవారం జిల్లా జలవనరుల శాఖ సీఈ, ఎస్ఈ, ఈఈలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాలేరు రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజీకి చేరిన నీటిమట్టం, రైతుల నుండి వస్తున్న ఒత్తిడి, క్షేత్ర స్థాయిలో సమస్యలతో సాగర్ డ్యాం నుండి జిల్లాకు రావాల్సిన వాటా సక్రమంగా చేరకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు వెల్లడించారని సమాచారం. దీంతో మూడు జిల్లాల సీఈలు చర్చించుకోవాలని ఈఎన్‌సీ సూచించగా, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల జలవనరుల శాఖ సీఈలు శంకర్‌నాయక్, రమేష్‌బాబు, అంజయ్య సమావేశమయ్యారని తెలిసింది. ఈ సందర్భంగా రోజుకు 5వేల క్యూసెక్కులకు తగ్గకుండా నీరు విడుదల చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కాగా, రెండు రోజులుగా పాలేరుకు చేరుతున్న సుమారు 3 వేల క్యూసెక్కుల నీటిని నిల్వ చేస్తుండడంతో పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 18 అడుగులకు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో బుధవారం నుంచి జిల్లా ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో ప్రతిభ



విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న సునీల్ శర్మ

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 26న జరిగిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో రుద్రంపూర్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 50 మీటర్ల ఫ్రీ స్టైల్, బటర్‌ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్స్ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబర్చారు. మహిళల విభాగంలో శ్రీరాముల శ్రీగాయిత్రి బంగారు పతకం సాధించింది. కాగా, పాఠశాలలో సోమవారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమంలో విజేతలను మాజీ ఐఏఎస్ అధికారి సునీల్ శర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, స్విమ్మింగ్ కోచ్ సామ్యూల్ అభినందించారు. ఈ సందర్భంగా సునీల్ శర్మ మాట్లాడుతూ.. తాను పాఠశాలలో చదువుకున్న రోజులు, నాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని అన్నారు. విద్య, వినయం, క్రీడలు, ఇంగ్లిష్ భాషలపై తనకు ఈ పాఠశాలలోనే పట్టు లభించిందని చెప్పారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్, జీఎం శ్రీసుభాని, కొత్తగూడెం ఏరియా జీఎం జె.రమేష్ డీవైజీఎం శ్రీజ్ఞాన సుందరం, స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వి.వి జోష్, జోసఫ్ పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల నుంచి దేశాన్ని రక్షించాలి

ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి




మాట్లాడుతున్న వెంకట్రామయ్య, పక్కన ముక్తి సత్యం తదితరులు

బూర్గంపాడు: పెట్టుబడిదారుల నుంచి దేశాన్ని కాపాడుకునే బాధ్యత రైతులందరిపైనా ఉందని అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య అన్నారు. మోరంపల్లిబంజరలో సోమవారం నిర్వహించిన ఏఐకేఎంఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగం ప్రమాదం అంచుకు చేరుకుందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎనిమిదిన్నర ఏళ్లలో వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలకుండా వారిని అడవుల నుంచి తరిమేసేలా పాలకులు కుట్ర పన్నుతున్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ ఆదివాసీలను మోసం చేస్తున్నారన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు రైతులను గట్టెక్కించలేవన్నారు. రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. పంటలకు గిట్టుబాటు ధరలు, పోడు భూముల పరిరక్షణ, గోదావరి ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముక్తి సత్యం, ఉమర్, నాయకులు తుపాకుల నాగేశ్వరరావు. జక్కుల రాంబాబు, కుంజా కృష్ణ. సుర్ణపాక నాగేశ్వరరావు, కందగట్ల సురేందర్, బండ్ల వెంకటేశ్వర్లు, బట్టు ప్రసాద్, ఎట్టి నరసింహారావు, రామచంద్రు, గొనినాగేశ్వరరావు, వీరమల్ల ఉమ పాల్గొన్నారు.

గాడి తప్పుతున్న బడి..

జిల్లా విద్యాశాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన..

- రెండు జిల్లాలకూ ఒకరే డీఈఓ
- 11 మంది ఎంఈఓలూ ఇన్‌చార్జ్‌లే..
- పరీక్షల వేళ.. కొరవడుతున్న పర్యవేక్షణ



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా విద్యాశాఖలో పాలన గాడి తప్పుతోంది. జిల్లాకు రెగ్యులర్ డీఈఓ లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఎవరికి వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఖమ్మం ఇన్‌చార్జ్ డీఈఓగా ఉన్న సోమశేఖర శర్మ భద్రాద్రి జిల్లాకు కూడా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ శాఖలో చేపట్టాల్సిన పనుల్లో జాప్యం జరుగుతోంది. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ జనవరిలో ప్రారంభమైంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో మోడల్ స్కూల్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎస్.ప్రసాద్‌ను జిల్లాకు డీఈఓగా నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఎ.దేవసేన జనవరి 30న ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడి డీఈఓ సోమశేఖర శర్మను ఖమ్మం బదిలీ చేశారు. అయితే ప్రస్తుతం ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు నిలిచిపోవడంతో ప్రసాద్‌ను తిరిగి యథాస్థానానికి పంపించారు. తిరిగి సోమశేఖరశర్మను ఇన్‌చార్జ్ డీఈఓగా నియమించారు. అయితే ఆయన అసలు పోస్టు డైట్ లెక్చరర్ కాగా, రెండు జిల్లాలకు ఇన్‌చార్జ్ డీఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల పర్యవేక్షణ భారంగా మారుతోంది. వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యాశాఖకు ఇది కీలక సమయం. ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటూ, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేస్తూ పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు ఉద్యోగులు, సిబ్బంది పనిని నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ పనులన్నీ రెండు జిల్లాల్లో ఒకే సమయంలో చేయడం అంత సులభం కాదు. దీంతో విద్యాశాఖలో పాలన గాడి తప్పే పరిస్థితి నెలకొందనే ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

కీలక పోస్టులన్నీ ఖాళీ..

జిల్లా విద్యాశాఖలో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. ప్రధాన పోస్టు అయిన డీఈఓ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో ఉండాల్సిన ఏడీ పోస్టు ఖాళీగానే ఉంది. ఇక 23 మండలాలకు ఎక్కడా రెగ్యులర్ ఎంఈఓలు లేరు. 11 మంది హెచ్‌ఎంలే 23 మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో కొందరు రెండు, మూడు మండలాల బాధ్యతలు సైతం చూడాల్సి వస్తోంది. దీంతో అటు మండలాలకు, ఇటు సొంత పాఠశాలకు సరైన న్యాయం చేయలేకపోతున్నారు. విద్యాశాఖకు సంబంధించి ఏవైనా మార్గదర్శకాలు, ప్రభుత్వ పాలసీలు, అభివృద్ధి కార్యక్రమాల వంటివి ముందుకు తీసుకెళ్లడంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది.

కానరాని పర్యవేక్షణ..

విద్యాశాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసుల్లో అందించే అల్పాహారంపైనా పర్యవేక్షణ కొరవడుతోంది. దీనిపై అధికారులు తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో విద్యార్థులకు అల్పాహారం పూర్తి స్థాయిలో అందుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విద్యాశాఖలో పోస్టులు భర్తీ చేయాలని, పాలన గాడిలో పెట్టేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

సావిత్రి మృతికి విప్ సంతాపం



సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు రూరల్: మున్సిపాలిటీలోని సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన జర్నలిస్ట్ కుంట సతీష్ తల్లి కుంట సావిత్రి సోమవారం మృతి చెందారు. పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి లక్ష్మీకుమారి, మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సంతాపం తెలిపినవారిలో ఎస్‌కె సర్వర్, సోందె కుటుంబరావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పీఆర్‌సీ విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు, ఉద్యోగులు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలు కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ యాజమాన్యం ఇప్పటికైనా నిర్లక్ష్య వైఖరి వీడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వజీర్, సుధీర్, మంగీలాల్, బ్రహ్మాజీ, అబ్దుల్‌మజీద్, కోటేశ్వరరావు, మహేశ్, సీతారం రెడ్డి, రాధాకృష్ణ, రాము, నరసింహారావు, నాగేశ్వరరావు, రవీందర్, కోటేశ్వరరావు, గిరిధర్, రాజేందర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ఆరుగురికి జైలుశిక్ష

భద్రాచలంఅర్బన్: చోరీ కేసుల్లో ఆరుగురు నిందితులకు భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.నీలిమ నాలుగు నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు.. జూలై 27, 2022న భద్రాచలం పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన ముత్తినేని గౌరీ ప్రసాద్ ఇంట్లో, జూలై 31, 2022న భద్రాచలం పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన తేజావత్ రాములు ఇంట్లో చోరీలు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. 10 మంది సాక్షులను విచారించి నిందితులకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ ఎస్.దుర్గాబాయి వాదించగా, కోర్టు కానిస్టేబుల్ విజయ్‌చంద్ సహకరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

సైన్స్‌పై మక్కువ..

- జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్న విద్యార్థులు
- సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్, సైన్స్ కాంగ్రెస్‌లలో ప్రతిభ
- రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఉపాధ్యాయురాలు ఎంపిక

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



రాష్ట్ర స్థాయి పోటీల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని పలువురు విద్యార్థులు సైన్స్‌పై మక్కువ చూపుతున్నారు. వివిధ పోటీల్లో పాల్గొంటూ ప్రశంసలు అందుకుంటున్నారు. సృజనాత్మకత చాటేలా విద్యాశాఖ అధికారులు కూడా వారిని ప్రోత్సహిస్తున్నారు. సైన్స్ పట్ల మరింత అవగాహన కల్పించేలా, పరిశోధనలపై ఆసక్తి కలిగేలా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏటా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో బాలబాలికలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్, బాలల సైన్స్ కాంగ్రెస్, ఎన్‌జీసీ, ఆర్ఎఎస్ వంటి పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చూపుతున్నారు. జిల్లా నుంచి రెండు సార్లు జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో పాల్గొనడం విశేషం.

ఇన్‌స్పైర్ మనాక్‌కు 86 మంది ఎంపిక..

ఈ ఏడాది జిల్లాలో 86 మంది విద్యార్థులు ఇన్‌స్పైర్ మనాక్ కింద ఎంపికయ్యారని, వీరికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. గతేడాది నవంబర్ 24 నుంచి 26వ తేదీ వరకు ఇల్లెందులో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫేర్, ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 21 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. అనంతరం నిర్మల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరఫున పంపించిన ప్రాజెక్ట్‌లలో రెండు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. ఆ తర్వాత కేరళలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఏజెన్సీ ప్రాంతం రొంపేడు ఆశ్రమ పాఠశాల, ఇల్లెందు ఓల్డ్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రాజెక్టులు ప్రదర్శించి సత్తా చాటారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో భద్రాచలం సెయింట్ పాల్స్ హైస్కూల్ విద్యార్థి పాల్గొని ప్రశంసలు అందుకున్నాడు.



ఉపాధ్యాయురాలు అనురాధ

మేదరబస్తీ పాఠశాల నుంచి ఎస్‌సీఈఆర్‌టీ సెమినార్‌కు..

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం హైదరాబాద్ ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహిస్తారు. ఈసారి సెమినార్‌కు జిల్లా నుంచి కొత్తగూడెంలోని మేదరబస్తీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు గుంటి అనురాధ ఎంపికయ్యారు. 'దేశంలో స్వావలంబన సాధించేందుకు సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించడం'అనే అంశంపై ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు బోధించేలా కళలు, ఆటలు, ఏకీకరణ అనే తదితర అంశాలపై ఆమె ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. అనురాధ ఎంపికపట్ల డీఈఓ సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సహకారంతోనే..



కలెక్టర్ ప్రోత్సాహంతో జిల్లా స్థాయిలో సైన్స్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. పాఠశాల స్థాయిలో తమ అభిరుచులకు అనుగుణంగా విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందించేలా ఉపాధ్యాయులు తగిన కృషి చేస్తున్నారు. జిల్లా నుంచి ప్రతి ఏటా ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

– ఎస్.చలపతిరాజు, జిల్లా సైన్స్ ఆఫీసర్

ఏపుగా పూల మొక్కలు..

పెంపకం చేపట్టిన మున్సిపల్ అధికారులు



కొత్త కాలనీ మున్సిపల్ నర్సరీలో పెంచుతున్న పూల మొక్కలు

ఇల్లెందు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమంలో ఇప్పటివరకు నీడ, ఫలాలనిచ్చే మొక్కలు నాటారు. ఈసారి పూల మొక్కలపై దృష్టి పెట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. ఈ దఫా నర్సరీల నిర్వహణకు ప్రతీ మున్సిపాలిటీకి రూ. 10 నుంచి రూ. 20 లక్షల వరకు నిధులు విడుదల చేయగా, ఈ నిధులతో అనువైన స్థలం ఎంపిక చేసుకుని అక్కడే చుట్టూ ఫెన్సింగ్, బోరు మోటార్ ఏర్పాటు చేసుకుని మొక్కల పెంపకం చేపట్టారు.

టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రభుత్వం నిర్ణయించిన మొక్కలను పెంచి మున్సిపాలిటీకి అప్పగించాల్సి ఉంది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు ఉండగా, నిధులను బట్టి ఒక్కో నర్సరీల్లో లక్ష, రెండు లక్షల మొక్కలను పెంచుతున్నారు. ఇల్లెందు మున్సిపాలిటీలో 80 వేల మొక్కలు, కొత్తగూడెం మున్సిపాలిటీలో ఐదు నర్సరీల్లో 2.50 లక్షల మొక్కలు, పాల్వంచలో ఐదు నర్సరీల్లో 2 లక్షల మొక్కలు, మణుగూరులో ఐదు నర్సరీల్లో లక్ష మొక్కల చొప్పున పెంచుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇంటికి ఆరు మొక్కలు..



నర్సరీల్లో పూల మొక్కల పెంపకం చేపట్టాం. ఇంట్లో కొద్దిపాటి స్థలం ఉంటే చాలు పూల మొక్కలను పెంచుకోవచ్చు. చామంతి, మందారం, మల్లె, లిల్లి, డాలింగ్, రోజ్, గులాబీ, తులిష్, కనకాంబరం వంటి మొక్కలను నర్సరీలో పెంచుతున్నాం. ప్రతీ ఇంటికి ఆరు చొప్పున అందజేస్తాం.

– అంకుషావళి, కమిషనర్, ఇల్లెందు

తునికాకు కట్టకు రూ.3.50 చెల్లించాలి

మావోయిస్టు పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ

చర్ల: తునికాకు కట్టకు రూ.3.50 చెల్లించాలని, వివక్ష లేకుండా అన్ని ప్రాంతాల్లో ఆకు సేకరణ జరపాలని, పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ విడుదల చేయాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మావోయిస్టు పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ సోమవారం పత్రికలకు ఒక లేఖ విడుదల చేశారు. లేఖలోని వివరాల ప్రకారం.. ఆకు సేకరణలో ప్రభుత్వంతోపాటు కాంట్రాక్టర్లు ఆదివాసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లోనే తునికాకు సేకరించడం వల్ల మిగితా ప్రాంతాల గిరిజనులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లో తునికాకు మోడెం కొట్టే పనులు తక్షణమే ప్రారంభించాలని, ఈ పనుల్లో పాల్గొనే కూలీలకు రూ. 700 వేతనం చెల్లించాలని, 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3.50 చెల్లించాలని డిమాండ్ చేశారు. తునికాకు సేకరణ సందర్భంలో ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు వైద్య ఖర్చులతో పాటు, కుటుంబ పోషణకు రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణించే కార్మికుని కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, తునికాకు కల్లేదార్లుగా స్థానికులనే నియమించాలని డిమాండ్ చేశారు. తునికాకు కల్లాల్లో పని చేసే కార్మికులకు కూడా వేతనాలు పెంచాలని లేఖలో అరుణ పేర్కొన్నారు.

చిట్టీల పేరుతో కుచ్చు టోపీ



మర్కోడులో వివరాలు తెలుపుతున్న బాధితులు

- సుమారు రూ.40 లక్షలతో ఉడాయింపు
- న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు

గుండాల: చిట్టీల పేరుతో ఓ వ్యక్తి గ్రామస్తులను మోసం చేసి ఉడాయించాడు. సుమారు రూ.40 లక్షలకు కుచ్చుటోపీ పెట్టడంతో రెండేళ్లుగా బాధితులు సదరు వ్యక్తి కుటుంబ సభ్యుల చుట్టూ తిరుగుతున్నారు. రూపాయి, రూపాయి పోగు చేసుకుంటే కాజేశారంటూ సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామంలో వెలుగుచూసింది. బాధితుల కథనం ప్రకారం... మర్కోడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చిట్టీల పేరుతో వ్యాపారం చేసేవాడు. డబ్బు వస్తుండటంతో జల్సాలకు అలవాటు పడ్డాడు. రూ.లక్షల్లో చిట్టీ పాటలు నిర్వహిస్తూ చివరకు గుట్టుగా పాటలన్నీ ఎత్తుకుని సుమారు రూ.35 లక్షలతో ఉడాయించాడు. ఈ క్రమంలోనే ఓ వృద్ధురాలి వేలి ముద్రలు తీసుకుని ఆమెకు తెలియకుండా లోన్ డబ్బులను రూ.90వేలు డ్రా చేసి తీసుకున్నాడు. ఈ విషయం బయటకు రావడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా రూ.40వేలు తిరిగి ఇచ్చాడు. మిగిలిన డబ్బులు వడ్డీతో సహా ఇస్తానని నమ్మించాడు. మరికొందరు గ్రామస్తుల వద్ద కూడా అప్పు తీసుకుని ఇవ్వలేదు. ఇలా సుమారు రూ. 40 లక్షలతో ఉడాయించాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోసపోయామని తెలుసుకుని సదరువ్యక్తి కుటుంబ సభ్యులను సంప్రదించగా పెద్దల సమక్షంలో వాయిదా పద్ధతిలో ఇస్తామని వారు హామీ ఇచ్చారు. ఏడాది గడిచినా వారు కూడా పట్టించుకోకపోవడంతో గతేడాది ఆళ్లపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అక్కడ కూడా న్యాయం జరగలేదని బాధితులు వాపోతున్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం మోసగాడిపై ఆరాతీసి తమకు న్యాయం చేయాలని బాధితులు పూనెం రాజు, లక్ష్మి, విజయ, శేఖర్, మల్లికార్జున్, శ్రీను, సుబ్బారావు, యాకయ్య, నవీన్, నర్సమ్మ తదితరులు కోరుతున్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: దాడి ఘటనలో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీకి చెందిన కాపుల రజినీ, అతని బావ కాపుల శ్రీను కుటుంబ సమస్యల కారణంగా గొడవ పడుతున్నారు. ఆ సమయంలో నాగేశ్వరరావు వారించబోగా..కోపోద్రిక్తుడైన శ్రీను కర్రతో దాడి చేశాడు. దీంతో నాగేశ్వరరావు కంటికి గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చుంచుపల్లి: విద్యానగర్ బైపాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడెం ఏ.పవర్‌హౌస్‌లో నివాసముంటున్న సుద్దపల్లి విజయలక్ష్మి (43) కొత్తగూడెంలో ఒక ప్రైవేట్ చిట్‌ఫండ్‌లో పనిచేస్తోంది. స్కూటీపై వేపలగడ్డకు వెళ్లి తిరిగి బైపాస్ మీదుగా ఇంటికి వెళ్తున్న క్రమంలో కొత్తగూడెం నుంచి సుజాతనగర్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చుంచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కలప స్వాధీనం

గుండాల: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన కలపను సోమవారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటవీశాఖ అధికారులు పోలీస్ శాఖతో కలిసి కార్పెంటర్ల ఇళ్లతోపాటు పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీ చేసి రూ. లక్ష విలువైన కలపను పట్టుకున్నారు. తనిఖీల్లో ఇల్లెందు డీఎఫ్ఓ నీరజ్‌కుమార్, గుండాల రేంజర్ మురళి, ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ చోరీ

భద్రాచలంఅర్బన్: చైన్ చోరీపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని భూపతిరావు కాలనీకి చెందిన సెల్‌ఫోన్ దుకాణం యజమాని రాజేష్ అనారోగ్యం కారణంగా ఆదివారం రాత్రి బస్టాండ్‌లో సేదతీరుతున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు రూ. 52 వేల విలువ గల బంగారపు చైన్, మొబైల్ ఫోన్ చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుప్రసాద్ తెలిపారు.

కృత్రిమ నవ్వులొద్దు.. ఫోజులసలే వద్దు..



సార్, మేడమ్ ఇటు చూడండి! అందరూ ఇటే చూడండి..!! కొద్దిగా నవ్వండి!!! ఇవీ సహజంగా మనకు ఫొటోగ్రాఫర్ల నుంచి ఎదురయ్యే సూచనలు. పెళ్లి, పేరంటం, ఇతర ఫంక్షన్ ఏదైనా ఫొటోగ్రాఫర్లు చెప్పినట్లు ఫోజులు ఇవ్వాల్సిందే. కానీ ఇదంతా గతం! ఎందుకంటారా 'క్యాండిడ్'గా పిలుచుకునే ఫొటోగ్రఫీకి ఆదరణ పెరుగుతోంది. ఆల్బమ్‌లో పేర్చేందుకు ఓ పక్క స్టిల్ ఫొటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్ తమ పని కానిచ్చేస్తుంటారు.. ఇదే సమయాన ఒక ఫొటోగ్రాఫర్ ఓపక్క నిల్చుని సహజత్వంతో కూడిన ఫొటోలను కాప్చర్ చేస్తుంటారు. వివాహమైతే పెళ్లి కూతురి వైపు వరుడి కొంటె చూపులు.. బర్త్ డే అయితే పిల్లాడిని అపురూపంగా చూసుకునే తల్లి.. రిటైర్‌మెంట్ ఫంక్షన్ అయితే సన్మానం అందుకునే ఉద్యోగిని ఆదర్శంగా తీసుకున్న సహచరుడి ఆనందం.. ఆవేదన.. ఇలా ప్రతీ స్టిల్‌ను ఫొటోగ్రాఫర్ తన కెమెరాలో బంధిస్తుంటాడు. ఆతర్వాత ఫొటోలు ఇస్తే చూసుకున్న వారు మురిసిపోవడం ఈ క్యాండిడ్ ఫొటోగ్రఫీ ప్రత్యేకత. – ఖమ్మం డెస్క్

క్యాండిడ్ ఫొటోగ్రఫీకి ఆదరణ

- పెళ్లిళ్ల నుంచి పార్టీల వరకు డిమాండ్
- సహజత్వం వైపు మొగ్గు చూపుతున్న పలువురు
- అత్యాధునిక కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో 'నాచురల్' ఫొటోలు

● గతం ఇలా...

చాలావరకు పెళ్లిళ్లలో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు చెప్పినట్లు వింటే మంచి స్టిల్స్ వస్తాయని.. పది కాలాల పాటు భద్రపర్చుకునే ఫొటోలు తీయించుకోవచ్చని అందరి భావన. కానీ ఫొటోగ్రఫీ నానాటికీ కొత్త పుంతలు తొక్కుతోంది. ఆల్బమ్‌లు రూపొందించేలా ఫొటోలు తీస్తూనే... క్యాండిడ్ ఫొటోగ్రఫీ వైపు కూడా మొగ్గు చూపుతున్నారు. అంటే ఇందులో ఎక్కడ కూడా కృతిమత్వం ఉండదు. నవ్వండి.. అందరూ ఇటు చూడండి... ఎత్తుల వారీగా నిల్చోండి.. ఇలాంటి సూచనలేమీ ఉండవు. ఫొటోగ్రాఫర్ మనలో ఒకరిగా తిరుగుతూ ఫొటోలు తీస్తూ ఉంటాడు. తద్వారా ఎక్కడా ఆర్టిఫీషియల్ నవ్వులు ఉండవు. స్వచ్ఛమైన నవ్వులు.. ఆనందంగా కనిపించే ముఖాలు.. ఇలా అన్నీ కెమెరాల్లో బంధించబడుతుంటాయి.

● కెమెరా చూస్తూనే ఉంటుంది

ముందస్తుగా రెడీ కావడం, కెమెరానే లక్ష్యంగా చేసుకుని సరిద్దుకోవడాలు క్యాండిడ్ ఫొటోగ్రఫీలో ఉండవు. ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా అరుదైన సన్నివేశాలను దొరకబుచ్చుకుని బంధించే క్యాండిడ్ ఫొటోగ్రఫీకి ఆదరణ పెరుగుతోంది. వాళ్లకు చెప్పకుండానే తీసే ఫొటోలు సహజంగా అందంగా రావడంతో... అసలైన ఫీలింగ్స్ వచ్చేస్తాయని చెబుతున్నారు.





● ఎమోషన్స్ ఎక్కువ

ఈ విధానంలో కెమెరా టెక్నిక్‌లు, ఫొటోగ్రాఫర్ల సూచనల కంటే ఎమోషన్స్‌ను బంధించేలా తీసే ఫొటోలు వస్తుంటాయి. దగ్గర.. దూరంగా ఉన్న వ్యక్తులను బంధించేలా మంచి కెమెరా ఉంటే చాలు.. సదరు కెమెరామెన్ అంతటగా తిరుగుతూ ఈ ఫొటోలు తీసేస్తారు. ఈక్రమంలో ఫొటోగ్రాఫర్లు కెమెరాతో కాకుండా మనస్సుతో చూస్తే మంచి ఫొటోలు వస్తాయని సీనియర్ ఫొటోగ్రాఫర్లు చెబుతున్నారు,.

● అన్నీ సబ్జెక్టులే..

కేవలం ఫంక్షన్లు, సమావేశాలు కాకుండా లోకంలో కనిపించే ప్రతీ అంశం క్యాండిడ్ ఫొటోగ్రఫీకి కథావస్తువేనని చెబుతారు. శీతాకాలం తెల్లవారుజామున పాలు అమ్ముకునేందుకు వెళ్తున్న వ్యక్తి.. వెచ్చదనం కోసం చలిమంట వేసుకుంటున్న వారు.. ఎండాకాలంలో చెమటలు కక్కుతూ ఉపాధి తిప్పలు పడుతున్న వారు.. ఇలాంటి వారందరినీ కెమెరాలో బంధించే ఫొటోగ్రాఫర్లు కనిపిస్తారు. ఇలాంటి సహజమైన ఫొటోలతో అవార్డులు గెలుచుకున్న వారినికూడా మనం చూడొచ్చు. అందుకే రానురాను క్యాండిడ్ ఫొటోగ్రఫీకి ఆదరణ పెరుగుతోందట.



సహజత్వాన్ని కోరుకుంటున్నారు...



పెళ్లిళ్ల సమయాన గతంలో ఆల్బమ్స్ కోసం ప్రత్యేకంగా స్టిల్ ఫొటోలు తీసేవాళ్లం. కానీ ఇప్పుడు స్టిల్ ఫొటోలతో పాటు నాచురల్‌గా తీసే ఫొటోలు కావాలని చాలా మంది అడుగుతున్నారు. అందుకే ఓపక్క వేదికపై కల్యాణ తంతు ఫొటోలు, వీడియో తీస్తూనే మరో ఫొటోగ్రాఫర్‌తో 'క్యాండిడ్' ఫొటోలు తీయిస్తున్నాం.

– పి.చిట్టిబాబు, అభి డిజిటల్స్, వనంవారి కిష్టాపురం

క్లుప్తంగా...

రేపు లాసెట్ నోటిఫికేషన్ విడుదల

- 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని యూనివర్సిటీలు, న్యాయ కళాశాలల్లో న్యాయ విద్యలో మూడేళ్ల, ఐదేళ్ల కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి టీఎస్ లాసెట్-2023, టీఎస్‌పీజీఎల్ సెట్-2023 షెడ్యూల్ విడుదలైంది. మార్చి 1న నోటిఫికేషన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్.లింబాద్రి విడుదల చేస్తారు. మార్చి 2వ తేదీ నుంచి సెట్ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు స్వీకరణ గడువు ఏప్రిల్ 6. రూ.500 అపరాధ రుసుముతో ఏప్రిల్ 12 వరకు, రూ.1000 అపరాధరుసుముతో ఏప్రిల్ 19, రూ.2వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 26 వరకు, రూ.4వేల అపరాధ రుసుముతో మే 3వ తేదీ వరకు అవకాశం కల్పించనున్నట్లు సెట్ కన్వీనర్ బి.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ లాసెట్-23, టీఎస్‌పీజీఎల్‌సెట్-23 పరీక్షలను మే 25వ తేదీన నిర్వహించనున్నారు. మే 29వ తేదీన ప్రిలిమినరీ కీ విడుదల చేస్తారు. అభ్యంతరాల స్వీకరణకు గడువు మే 31గా నిర్ణయించారు. తుది కీ, ఫలితాల ప్రకటన తేదీలను ఆ తర్వాత ప్రకటించనున్నారు.

నేడు టీఎస్ఐసెట్ నోటిఫికేషన్ విడుదల

కేయూ క్యాంపస్: తెలంగాణలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరం (2023-2024) ప్రవేశాలకుగాను టీఎస్ఐసెట్-2023 నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, టీఎస్ఐసెట్ చైర్మన్, కేయూ వీసీ తాటికొండ రమేశ్ విడుదల చేస్తారని టీఎస్ఐసెట్ కన్వీనర్, కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి సోమవారం తెలిపారు.

సిసోడియాకు ఒక న్యాయం.. అదానీకి ఒక న్యాయమా?

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను అరెస్టు చేశారు కానీ, ఆర్థిక కుంభకోణాల్లో అతిపెద్ద కుంభకోణానికి పాల్పడిన అదానీని అరెస్టు చేయరా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు ప్రశ్నించారు. నిజాయితీగా అత్యధిక మెజారిటీతో 90 శాతానికి పైగా సీట్లతో అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీని కూడా బతకనివ్వరా? అని ఆయన నిలదీశారు.

గుడిసె గోడు.. ఆలకించాలి దొర!





ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ ఏళ్లుగా పోరాటాలు చేస్తున్న ఆదివాసీలు తమ దైవమైన హీరా సుఖ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల మండలం బట్టిసావర్గాం శివారు సర్వే నం.72 వద్ద 20 ఎకరాల్లో సుమారు వెయ్యిమంది గుడిసెలు వేశారు. ఈ స్థలంపై తమకు హక్కులు కల్పించాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న మావల ఆర్ఐ హన్మంత్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని గుడిసెలు తొలగించేందుకు ప్రయత్నించగా..వారు వినకపోవడంతో ఆర్ఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

రాష్ట్రాభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- తెలంగాణ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్రపై వరంగల్ వేదికగా చర్చిద్దాం
- కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్
- కేసీఆర్ రాక్షస పాలనకు అంతం ఖాయం
- 4కోట్ల మంది నుంచి కల్వకుంట్ల కుటుంబం బహిష్కరణ
- జోడో యాత్రలో టీపీసీసీ చీఫ్



బహిరంగసభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి



పరకాల: తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర లేదంటున్న కేటీఆర్.. కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమిటో తెల్సుకోవడానికి వరంగల్ ఏకశిల పార్క్ వద్ద చర్చకు సిద్ధమా అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రేవంత్ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్ర సోమవారం పరకాల పట్టణానికి చేరుకుంది. బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. '4 కోట్ల తెలంగాణ ప్రజలందరూ నా కుటుంబం అని చెప్పుకునే కేటీఆర్ ప్రగతి భవన్‌కు ప్రజలను ఎందుకు రానివ్వడం లేదు. ఒక్క కుటుంబాన్ని అయినా పిలిచి భోజనం పెట్టలేదు. అలాంటి కల్వకుంట్ల కుటుంబాన్ని 4కోట్ల ప్రజలనుంచి బహిష్కరిస్తున్నాం. దీనిని పోరుగడ్డ అయిన పరకాల నుంచి ప్రకటిస్తున్నా'అని అన్నారు. ఓటు అనే ఆయుధంతో కేసీఆర్ రాక్షసపాలను అంతమొందించాలన్నారు. రాక్షసుడి బలంలో చిలుకలో ఉన్నట్లు.. కేసీఆర్ బలం ఎమ్మెల్యేలలో ఉందని వారందరినీ..చిలుక మెడలు విరిచినట్లు..వచ్చే ఎన్నికల్లో వీరిని చిత్తుగా ఓడిస్తే కేసీఆర్ అనే రాక్షసుడు బలహీనుడు అవుతాడన్నారు. వేధింపులతో గిరిజన డాక్టర్ బిడ్డ ప్రీతి ప్రాణాలను పొట్టనపెట్టుకున్నా, 4ఏళ్ల చిన్నారిని కుక్కలు దాడి చేసి చంపినా కూడా చలించని, పలకరించని కల్వకుంట్ల కుటుంబాన్ని క్షమించకూడదన్నారు. 'నీ ఇంట్లో ఆడబిడ్డను ఎవరైనా చంపితే ఇలాగే చేస్తావా'అని కేసీఆర్‌నుద్దేశించి ప్రశ్నించారు.

వైఎస్ హయాంలో సంక్షేమం

రాష్ట్రంలో వైఎస్సార్ హయంలో పేదలకు ఆరోగ్య శ్రీ, రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇల్లుల నిర్మాణం, ఉచిత విద్యుత్ అమలు చేసి ఆదుకున్నారని రేవంత్ గుర్తు చేశారు. మంత్రి దయాకర్ దండుపాళ్యం ముఠా దోపిడీలకు పాల్పడుతోందనీ పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలో పేరులోనే ధర్మం తప్ప అంత దందాలే చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అంజయ్యకుమార్ యాదవ్, పరకాల నియోజవర్గ ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు రేవంత్‌రెడ్డి నాయకులతో కలిసి మెడికో ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

'ఉత్తమ ప్రణాళికలే ప్రగతికి పునాది'

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాల రూపకల్పన, అమలు, ఫలితాల సాధనకు ఉత్తమ ప్రణాళికలే ప్రగతికి పునాదులు వేస్తాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యకమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రణాళిక, అర్థగణాంక శాఖ ఉన్నతాధికారులు, సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్(సీఈజీఐఎస్) కాకతీయ గవర్నెన్స్ ఫెలో(కేజీఎఫ్)లతో వినోద్‌కుమార్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రణాళిక శాఖ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. రాష్ట్రంలో కీలకమైన ప్రణాళిక, అర్థగణాంక , సీజీఎస్, కేజీఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

పోలీస్ వాహనాన్ని ఆపి | భైరి నరేశ్‌పై దాడి

- బీజేపీకి, హిందూత్వకు వ్యతిరేకంగా మాట్లాడితే సహించేది లేదని బెదిరింపు
- హన్మకొండ పీఎస్‌లో ఎస్సై రవికిరణ్ ఫిర్యాదు



పోలీస్ వాహనంలోకి చొరబడి దాడి చేస్తున్న వ్యక్తులు

వరంగల్ క్రైం: భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు భైరి నరేశ్‌పై హన్మకొండలో మూకుమ్మడి దాడి జరిగింది. హన్మకొండ ఆదర్శ కళాశాలలో లా చదువుతోన్న భైరి నరేశ్ సోమవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అతనిపై దాడి జరగనుందని పోలీసులకు అందిన సమాచారంతో వాహనంలో తరలిస్తుండగా కొందరు ద్విచక్ర వాహనాలను అడ్డుపెట్టి ఆపారు. హిందూత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే క్షమించేది లేదంటూ నినాదాలు చేస్తూ పోలీస్ వాహనం లోపలికి చొరబడి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో భైరి నరేశ్‌తోపాటు సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అచ్యుత్ రాజ్ ఉన్నారు. దాడి అనంతరం పోలీసులు భైరి నరేశ్‌ను హన్మకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్ వాహనాన్ని అడ్డగించి దాడి చేయడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. దాడికి పాల్పడిన వారిని వీడియోల ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు వేట ప్రారంభించారు.

దాడి సమాచారం తెలిసే పోలీసులను ఆశ్రయించాను

ఆదర్శ లా కళాశాలలోని అంబేద్కర్ భవన్‌లో ఎదురుగా ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, ఏబీవీపీ కార్యకర్తలు నాపై దాడి చేయడానికి ఉన్నారని తెలిసి పోలీసులకు సమాచారం ఇచ్చాను. పోలీసు వాహనంలో బయల్దేరిన నన్ను బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వెంబడించి అడ్డుకుని దాడి చేశారు. ప్రజాస్వామ్యంలో భావ ప్రకటన స్వేచ్ఛ అందరికీ ఉంది. నాపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం.

-భైరి నరేశ్, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు

నిందితులపై కేసు నమోదు చేస్తున్నాం..

సుబేదారి ఎస్సై రవికిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసు వాహనాన్ని అడ్డగించి వాహనంపై దాడి చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించి, అందులో ఉన్న భైరి నరేశ్‌పై దాడి చేసిన నిందితుల మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. చట్టపరంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తాం.

- శ్రీనివాస్‌జీ, హన్మకొండ ఇన్‌స్పెక్టర్

మై బిగ్గెస్ట్ చీర్ లీడర్

- మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం
- సమానత్వం పై ప్రచారం
- అడిషనల్ డీజీ శిఖాగోయల్

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళా భద్రత విభాగం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'మై బిగ్గెస్ట్ చీర్‌లీడర్'పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా తమ జీవితాల్లో సమానత్వం నింపి, ప్రోత్సహించిన వ్యక్తుల గురించి పరిచయం చేయాలని భద్రత విభాగం ఇంచార్జి, అడిషనల్ డీజీ శిఖాగోయల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ట్వీట్ పెట్టారు. మై బిగ్గెస్ట్ చీర్ లీడర్ పేరిట నిర్వహిస్తున్న ఈ ఆన్‌లైన్ ప్రచారంలో భాగస్వాములు కావాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ మహిళా భద్రత విభాగం ట్విట్టర్ ఖాతాలో వీడియో లేదా ఫొటోను జత చేయాలని కోరారు. అదేవిధంగా మరో ముగ్గురిని ట్యాగ్ చేయాలని సూచించారు. ఇలా వచ్చే వీడియోల నుంచి ఉత్తమమైనవి ఎంపిక చేసి, వాళ్లను సన్మానించనున్నట్టు తెలిపారు.

మా నాన్నే నా చీర్‌లీడర్..

అడిషనల్ డీజీ షికా గోయల్ బిగ్గెస్ట్ చీర్ లీడర్ వీడియోలో మాట్లాడుతూ 'నా బిగ్గెస్ట్ చీర్ లీడర్ మా నాన్నే. నాపై నాకంటే మా నాన్నకే ఎక్కువ నమ్మకం ఉండేది. అత్యంత కఠినమైన ఈ పోలీస్‌జాబ్‌లో చేరడంలోనూ ఆయనే కీలకం. సివిల్స్ రిజల్ట్ వచ్చిన రోజు నాకు ఇంకా గుర్తుంది. "ఏం సందేహపడకు..నువ్వు కచ్చితంగా ఈ వృత్తిలో రాణిస్తావు". అని ప్రోత్సహించారు. ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉండేలా చేసినందుకు నాన్నా నీకు కృతజ్ఞతలు. ఇంట్లో మా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లను సమానంగా చూసినందుకు కూడా మీకు కృతజ్ఞతలు చెబుతున్నా..నా మాదిరిగానే మీ జీవితంలోనూ ఒక బిగ్గెస్ట్ చీర్ లీడర్ ఉండే ఉంటారు. వారి గురించి మాకు చెప్పండి'అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

వ్యాధులపై అవగాహన అవసరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ, తదితరులు

నెహ్రూసెంటర్: వ్యాధులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని మహబూబాబాద్ డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్ అన్నారు. వ్యాధులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆయన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. పది రకాల పోస్టర్లను పీహెచ్‌సీ, సబ్ సెంటర్లలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అధికారులు కే.వీ.రాజు, రవీందర్‌రావు, రుక్కుద్దీన్, కృష్ణార్జున్‌రావు, గీత, మహేందర్‌రెడ్డి, మనోహర్, అరుణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య ఘర్షణ

- రెండు వర్గాలుగా విడిపోయిన సీనియర్లు, జూనియర్లు
- పరస్పరం దాడులు

అశ్వారావుపేటరూరల్: ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగి పరస్పరం దాడులకు పాల్పడిన ఘటన సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి కళాశాల వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. విద్యార్థులు సీనియర్లు, జూనియర్లుగా విడిపోయి ఘర్షణకు దిగారు. వివరాలిలా ఉన్నాయి.. కళాశాలలో కొద్ది రోజులుగా క్రీడా పోటీలు జరుగుతుండగా, ఇందులో పాల్గొన్న ఓ సీనియర్ విద్యార్థి రాక కోసం అశ్వారావుపేటకు వచ్చే కళాశాల బస్సును కాసేపు ఆపారు. దీంతో జూనియర్ విద్యార్థులు అభ్యంతరం తెలిపారు. వెంటనే బస్సులో ఉన్న ముగ్గురు సీనియర్ విద్యార్థులు ఈ విషయంలో ఓ జూనియర్ విద్యార్థితో గొడవ పడుతుండగానే డ్రైవర్ బస్సును కదిలించాడు. ఆ కుదుపునకు అదుపుతప్పిన జూనియర్ విద్యార్థి మరో సీనియర్ విద్యార్థినికి తగిలాడు. ఇలా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతుండగానే బస్సు దమ్మపేట మండలం మందలపల్లి వద్దకు చేరుకుంది. దీంతో దాడికి గురైన విద్యార్థి తన స్నేహితులకు సమాచారం అందించగా, దాదాపు 8 మంది యువకులు ఓ కారులో వచ్చి మందలపల్లి వద్ద ఆగి ఉన్న కళాశాల బస్సు ఎక్కి సీనియర్ విద్యార్థులతో ఘర్షణ పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు బస్సును అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. స్థానిక సీఐ బాల్యకృష్ణ విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని కౌన్సిలింగ్ చేశారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని, లిఖిత పూర్వకంగా తమకు ఫిర్యాదు అందలేదని సీఐ విలేకరులతో చెప్పారు.

బీజేపీ వ్యతిరేక శక్తుల సమీకరణే లక్ష్యం

- వచ్చేనెల 17 నుంచి కేంద్ర విధానాలపై 'ప్రజాగర్జన'
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం, వేదికపై నాయకులు నాగేశ్వరరావు, సుదర్శన్‌రావు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో ప్రమాదం ముంచుకొస్తున్న నేపథ్యాన.. ఆ పార్టీ వ్యతిరేక శక్తుల సమీకరణే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. నూతన ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేస్తూ ప్రభుత్వ రంగ కంపెనీలను ప్రైవేట్‌కు ధారాదత్తం చేస్తోందని ధ్వజమెత్తారు. ఖమ్మంలోని మంచికంటి సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ వైఖరి రీత్యానే బీఆర్ఎస్‌తో మైత్రి ఉంటుందని తెలిపారు. కాగా, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చేనెల 17నుంచి ప్రజాగర్జన యాత్రలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మూడు బృందాలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి ప్రారంభమయ్యే ఈ జాతాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మార్చి 17న తన సారథ్యాన హన్మకొండలో ప్రారంభమయ్యే యాత్రను జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఇక ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్ నుంచి మరో రెండు బృందాలు యాత్రలు నిర్వహిస్తూ మార్చి 30 నాటికి హైదరాబాద్‌లోని తుర్కయాంజాల్ ప్రాంతానికి చేరుకుంటాయని వివరించారు. కాగా, ఏన్కూరు వద్ద 21న జిల్లాలోని ప్రవేశించే యాత్ర నాలుగు రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. కార్పొరేట్ల తొత్తుగా మారిన బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ యాత్ర కొనసాగుతుందని తమ్మినేని స్పష్టం చేశారు. ఇక తమను వ్యతిరేకించే వారిని బెదిరించేందుకే ఈడీని బీజేపీ వాడుకుంటోందని విమర్శించారు. ఉత్తరాదిలో వస్తున్న వ్యతిరేకతను దక్షిణాదితో పూడ్చుకోవాలని చూస్తోందని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టుకు అందాల్సిన సాగర్ జలాలను విడతల వారీగా కాకుండా నిరంతరాయంగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు మాట్లాడగా, తొలుత పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి మృతిపై సంతాపం ప్రకటించారు. నాయకులు ఎర్ర శ్రీకాంత్, మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం, పొన్నం వెంకటేశ్వర్లు, వై.విక్రమ్, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వర్లు, చింతల చెరువు కోటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, పార్టీ సీనియర్ నాయకులు ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం




సభలో అభివాదం చేస్తున్న నాయకులు

- మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు భాస్కర్

ఖమ్మం మామిళ్లగూడెం: ఐకమత్యమే మహాబలమని, అందరూ కలిసిమెలిసి ఉంటే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ అన్నారు. మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర 3వ మహాసభలు సోమవారం ఖమ్మంలో ప్రారంభమయ్యాయి. తొలుత పెవిలియన్ గ్రౌండ్ నుండి ర్యాలీగా బయలుదేరి జెడ్పీ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో భాస్కర్ మాట్లాడుతూ 28ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ఏబీసీడీల చుట్టూ తిరుగుతుండగా, 59 కులాలకు రావాల్సిన హక్కుల విషయంలో అడుగు ముందుగు పడలేదని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మాదిగల బ్రతుకులు రాష్ట్రం వచ్చాక ఆగమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయాల్లో పదవులేవి కూడా దరిదాపులకు చేరడం లేదన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ పాల్వంచ రామారావు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి రాంబాబుతో పాటు వినయ్‌కుమార్, సురేందర్, శంకర్, నరేష్‌కుమార్, బెల్లంకొండ శ్యామల, నరసయ్య, శోభ, ప్రసాద్, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ రామారావు

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్ విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని మహబూబాబాద్ డీఈఓ రామారావు సూచించారు. అనంతారం మోడల్ స్కూల్‌ను సోమవారం సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. జీసీడీఓ విజయకుమారి, పాఠశాల ప్రిన్సిపాల్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎంపిక పోటీలు



త్రో బాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లా పరిధి కిన్నెరసాని(బాలురు), కాచనపల్లి(బాలికలు)లోని మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో విద్యార్థుల ఎంపికకు కిన్నెరసాని క్రీడా పాఠశాల్లో నిర్వహిస్తున్న పోటీలు కొనసాగుతున్నాయి. ఈమేరకు సోమవారం జరిగిన పోటీలకు 200మంది విద్యార్థులు హాజరుకాగా, వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులను వచ్చే నెల 18వ తేదీన తుది పరీక్ష ఉంటుందని ఐటీడీఏ క్రీడల అధికారి డాక్టర్ వీరా నాయక్ తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చందు, పీడీలు ఎస్.సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, నగేష్, మోతీలాల్, హరికృష్ణ, కృష్ణవేణి, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉసిరికాయలపల్లిలో....

కారేపల్లి: మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి ఆశ్రమపాఠశాలలో సోమవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. హెచ్ఎం బి.నామానాయక్ ఆధ్వర్యాన పోటీలు నిర్వహించగా, బాలురు 44మంది, బాలికలు 31 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ నర్సింగ్ తిరుమలరావు, ఏసీఎంఓ ఎల్.రాములు, పీడీలు ప్రసాద్, నెహ్రూ, సత్రాం, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



సమస్యలు తెలుసుకుంటున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఏజెన్సీ గిరిజనుల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ సూచించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం సంబంధిత యూనిట్ అధికారులకు అందచేసి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా అనేక పథకాలను అమలుచేస్తోందని తెలిపారు. వీటిని అర్హులు ఉపయోగించుకుంటూ ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. కాగా, వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ సురేష్‌బాబు, అగ్రికల్చర్ ఏడీ భాస్కరన్, డీఎస్‌ఓ ప్రభాకర్‌రావు, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాల సాధనకు కృషి

ఉమ్మడి జిల్లాలోని గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేస్తామని గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీవో, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల అసిస్టెంట్ కార్యదర్శి వెంకటేశం జూమ్ మీటింగ్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహణ, ఇంటర్మీడియట్‌లో హాజరు శాతం తగ్గకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో చేపట్టిన కార్యాచరణను డేవిడ్‌రాజ్ వివరించారు.

భద్రాద్రిలో నిత్యాన్నదానానికి వితరణ



దాతకు రశీదు ఇస్తున్న ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్ భక్తులు సోమవారం విరాళం అందచేశారు. కూకట్‌పల్లికి చెందిన పోతరాజు సాంబశివ రూ.లక్షను ఆలయ అధికారులకు అందచేయగా వారు రశీదు ఇచ్చి స్వామి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రాంరెడ్డి, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయంలో దర్శకుడు హను, తదితరులు

రామయ్య సన్నిధిలో సినీ దర్శకుడు హను

భద్రాచలంలో సీతారామ చంద్రస్వామి వారిని సినీ దర్శకుడు హను రాఘవపూడి, శత్రు, యువరాజ్ దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులు, ఉపాలయాల్లో పూజలు చేశారు. ఈసందర్భంగా అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కాగా, కొత్తగూడెం వాసి అయిన హను భద్రాచలంలోని తన స్నేహితులను కూడా కలిశారు.